క్లుప్తంగా

టీడీపీకి ఓటమి భయం

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గౌరి



నెల్లూరు(బారకాసు): 'తెలుగుదేశం పార్టీకి ఓటమి భయం పట్టుకుంది. అందుకే పచ్చ మీడియా ద్వారా జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులపై దుష్ప్రచారం చేస్తోంది' అని ఆ పార్టీ జిల్లా మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి జిల్లా కంచుకోట అన్నారు. వైఎస్సార్‌సీపీ సస్పెండ్ చేసిన నాయకులు బాబుకు దిక్కయ్యారని తెలిపారు. వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ అయిన చంద్రబాబు వెంట నడవడానికి సిద్ధమైన ఎమ్మెల్యేల రాజకీయ భవిష్యత్ ముగిసి నట్లేనని ప్రజలు అభిప్రాయపడుతున్నారన్నారు. నెల్లూరు ఎంపీ, పార్టీ రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అభివృద్ధికి మరో పేర న్నారు. ఎంపీగా పార్లమెంట్ సమావేశాల్లో అనేక ప్రశ్నలు వేశారన్నారు. తమ సమస్యలకు పరిష్కారం చూపే నేత వచ్చాడనే సంతోషం రూరల్ ప్రజలు, పార్టీ శ్రేణుల్లో కనిపిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం నిర్దేశించిన పార్టీ కార్యక్రమాను ఆదాల ముందుకు తీసుకెళ్తున్నారని, ఎక్కడా సమన్వయం లోపం లేకుండా చూస్తున్నారని వివరించారు. ఎవరు ఎన్ని కుట్రలు కుంతంత్రాలు చేసినా, ఎంతమంది కలిసినా రాబోయే ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు.

22న శ్రీరాముడి శోభాయాత్ర

పొదలకూరు: పట్టణంలో ఈ నెల 22న ఉదయం 9 గంటలకు శ్రీరాముడి భారీ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీలక్ష్మిగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్వాహకులు బుధవారం తెలిపారు. అయోధ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా రామనగర్‌గేటు సెంటరు నుంచి రామమందిరం మీదుగా వెంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు శోభాయాత్ర సాగుతుందని చెప్పారు. శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

మనుబోలు: వెంకటాచలం, మనుబోలు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నెల్లూరులో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మనుబోలు మండలంలోని మనుబోలు కోదండరామపురం, అక్కంపేట, కొలనకుదురు (ఎస్సీకాలనీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, వెంకన్నపాళెం, వెంకటాచలం మండలంలోని నిడిగుంటపాళెం(ఎస్సీకాలనీ), కంటేపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లోని సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఇంటర్వ్యూ కాల్‌లెటర్, దరఖాస్తు రెసిప్ట్‌తో నెల్లూరులోని ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.

కామాక్షితాయి సేవలో జిల్లా అదనపు జడ్జి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని జిల్లా అదనపు జడ్జి జీ కపర్ధి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ గిరికృష్ణ జడ్జిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రంగవల్లులు సంస్కృతికి చిహ్నాలు

కోవూరు: రంగవల్లులు సంస్కృతికి చిహ్నాలని ట్రెయినీ డీఎస్పీ హేమలత పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా ది లైట్ హార్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు సహకారంతో కోవూరులోని కోనేటి కయ్యల ప్రాంతంలో నిర్వహించిన రంగవల్లులు, స్లో సైక్లింగ్ పోటీల విజేతలకు బుధవారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ట్రెయినీ డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అందులో భాగంగా ఏటా ది లైట్ హార్స్ ఫౌండేషన్ రంగవల్లుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గౌరి, తన్మయ్, భరత్ కుమార్, చక్రి. శ్యామ్, వేణు, తేజ, అనూష్ రెడ్డి, మదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

పొదలకూరు: స్థానిక అయ్యప్పనగర్‌లోని శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి గడ్డం మస్తాన్‌రెడ్డి, లక్ష్మీ ప్రసన్న దంపతులు రూ.లక్ష నగదు విరాళాన్ని బుధవారం అందజేశారు. అశ్వ వాహనం తయారీ కోసం నగదు విరాళాన్ని ఆలయ చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డికి అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు, అల్లూరు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.





పూజలు చేస్తున్న మహిళలు



గాలిపటాలు ఎగురవేస్తూ..



కుంకుమ పెడుతూ..

ఏటి పండగ కోలాహలం

- భక్త జనసంద్రంగా పినాకినీ తీరం
- చిన్నారుల ఆటపాటలు.. యువత కేరింతలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రంగనాయకులపేటలో పెన్నా నది తీరంలో బుధవారం సాయంత్రం ఏటి పండగ కోలాహలంగా జరిగింది. పెద్దలు, పిల్లలు, మహిళలు, యువతీ యువకులు పెద్దఎత్తున తరలివచ్చి సందడి చేశారు. సంప్రదాయ ఏటి పండగను భక్తిభావంతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్న సంకల్పంతో కులమతాలకు అతీతంగా తరలివచ్చిన ప్రజానీకంతో పినాకినీ తీరం హోరెత్తింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై హుషారెత్తించే సినీ గీతాలు.. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను అందరూ వీక్షించి ఉల్లాసంగా గడిపారు. ధనుర్మాసంలో తమ ఇళ్లలో భక్తిశ్రద్ధలతో పూజించిన గొబ్బెమ్మలను (గౌరమ్మలను) గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. తమ ఇంటిల్లిపాదికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నారు. సంప్రదాయంలో భాగంగా ఒకరికొకరు కుంకుమబొట్లు పెట్టుకుంటూ పసుపు, కుంకుమ, గాజులను గంగమ్మతల్లికి సమర్పించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

ఏటి పండగ సందర్భంగా నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి బ్యారేజీని విద్యుద్దీపాలతో నయనానందకరంగా అలకరించారు. విద్యుద్దీపాలంకరణలో, భారీఎత్తున ఏర్పాటు చేసిన ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పినాకినీ తీరం కళకళలాడింది. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

కులమతాలకు అతీతంగా..

ప్రజలు కులమతాలకు అతీతంగా తరలిరావడంతో రంగనాయకులపేట, గోపురంవీధి, శెట్టిగుంట రోడ్డు, మైపాడురోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, సంతపేట పరిసరాలు రద్దీగా మారాయి. ప్రజానీకానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ సూచనల మేరకు వివిధ ప్రభుత్వశాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు.

కొలువైన దేవతామూర్తులు

ఏటి పండగలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దేవతామూర్తులు పినాకినీ తీరంలో కొలువై భక్తులను కటాక్షించారు. ఈ ఏడాది దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో గణనాథుడు, రాజరాజేశ్వరి అమ్మవారు, శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి, మూలాపేట శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి, జొన్నవాడ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవారు, నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారు, మహాలక్ష్మి, చెంచులక్ష్మి సమేత వేదగిరి లక్ష్మి నృసింహ స్వామి సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు కొలువై భక్తులను అనుగ్రహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్లు విశేష పుష్పాలంకరణలో నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. దేవాదాయ శాఖ జిల్లా అధికారి జె.శ్రీనివాసరావు, ఆయా దేవస్థానాల కార్యనిర్వహణాధికారులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వేదికపై ఎమ్మెల్యే అనిల్, నాయకులు

పాల్గొన్న నెల్లూరు సిటీ ఎమ్మెల్యే

ఏటి పండగలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ పాల్గొన్నారు. ప్రత్యేకంగా కొలువైన స్వామివార్లను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏటి పండగ సందర్భంగా వెంకటేశ్వరపురం, గాంధీగిరిజన కాలనీ, జనార్ధనరెడ్డి కాలనీ, పడుగుపాడు, సాలుచింతలు, వారధి సెంటర్ ప్రాంతాల వారి కోసం ప్రత్యేకంగా వెంకటేశ్వరపురం ప్రాంతంలోని పెన్నానది వద్ద ఏర్పాట్లు చేశారు. సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ, సచివాలయ సిబ్బంది ప్రజలకు వసతులు కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వచ్చిన ప్రజలకు ప్రసాదాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాలశంకర్‌రెడ్డి, 53వ డివిజన్ నాయకులు బాగి వెంకటరమణ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శన



ప్రసాదం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు





కొలువుదీరిన దేవతామూర్తులు





దర్శించుకునేందుకు విచ్చేసిన ప్రజలు



పూజలు చేస్తున్న మహిళలు

సమస్యలను పరిష్కరించాలంటూ..

నెల్లూరు(పొగతోట): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సెర్ప్ ఉద్యోగుల సమాఖ్య (జేఏసీ) నాయకులు కోరారు. బుధవారం డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెర్ప్‌లో అనేక సంవత్సరాల నుంచి పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరుస్తున్నామన్నారు. సర్వీస్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. కారుణ్య నియామకాలు వర్తింపజేయాలన్నారు. పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు.



మాట్లాడుతున్న ఉద్యోగులు

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నెల్లూరు(వేదాయపాళెం): సంక్రాంతిని పురస్కరించుకుని నెల్లూరు సిరి హాల్ ఎదురుగా ఉన్న జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయం సమీపంలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. 50 డివిజన్ కార్పొరేటర్ జయలక్ష్మి, 8వ డివిజన్ కార్పొరేటర్ కామాక్షి దేవి విచ్చేసి ముగ్గులను పరిశీలించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖజానా వెంకటశేషయ్య ఆచారి మాట్లాడుతూ మహిళా కమిటీ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి ఏలూరు బాబు ఆచారి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శానంపూడి మహేశ్వరి, నగర అధ్యక్షురాలు జయలక్ష్మి, మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు పాలూరు జ్యోతి, ఏలూరు కవిత, పేట శ్రీదేవి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న దృశ్యం

హెడ్‌కానిస్టేబుల్ మృతికి సంతాపం

నెల్లూరు(క్రైమ్): ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. ఆయన మృతి పట్ల ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర నాయకుడు వై.శ్రీహరి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

జాబ్ మేళా రేపు

నెల్లూర(మినీబైపాస్): ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళాను శుక్రవారం నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్, తిరుపతి నిర్వాహకులు పాల్గొననున్నారని తెలిపారు. ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్, సీనియర్ ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్, ప్రాసెస్ స్పెషలిస్ట్, టీమ్ లీడ్, అసిస్టెంట్ మేనేజర్, టెక్నికల్ హెల్ప్‌డెస్క్ సపోర్ట్ ఉద్యోగాలకు గానూ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని చెప్పారు. డిగ్రీ అర్హత కలిగిన వారు అర్హులని, కంప్యూటర్ సైన్స్ వారికీ అవకాశం ఉందని చెప్పారు. ఆసక్తి గల వారు ఉదయం 10.30కు నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూర్ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ వద్ద ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బుధవారం రాత్రి ఆమె బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. షటిల్ పోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందిన చాముండేశ్వరి టీమ్‌కు, అలాగే ద్వితీయ బహుమతి గెలుపొందిన ఫ్రేమ్–2 టీమ్‌కు అభినందనలు తెలిపారు. క్రికెట్‌లో మొదటి స్థానంలో ఏ–11 టీమ్, రెండో స్థానంలో ఫైటర్స్ టీమ్ నిలవగా వారిని అభినందించారు. ప్రతి సంవత్సరం ఇలాగే క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. మళ్లీ జగనన్న ప్రభుత్వం ఏర్పడేందుకు ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నెల్లూరు రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్ చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరుణమ్మ, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

జేవీవీ విజ్ఞాన గీతాల సీడీ ఆవిష్కరణ

నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో బుధవారం జనవిజ్ఞాన వేదిక విజ్ఞాన గీతాల సీడీని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి కాలేషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి మొదటి వారంలో జరిగే జేవీవీ రాష్ట్ర కళాజాత నేపథ్యంలో ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు విజ్ఞాన పాటల సీడీని ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ ఎ.విజయ్ కుమార్, కళాకారులు పార్వతీశం, సుబ్రహ్మణ్యం, గోపినాథ్, ఉదయ్‌భాస్కర్, కృష్ణారెడ్డి, యూటీఎఫ్ నాయకుడు చలపతి శర్మ, ప్రజానాట్య మండలి నాయకులు శేషయ్య, సాహితీ స్రవంతి, గోపి తదితరులు పాల్గొన్నారు.



సీడీలను ప్రదర్శిస్తున్న నాయకులు

రూరల్ అభివృద్ధికి ఆదాల కృషి

- ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధి ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఏఎంసీ చైర్మన్ పెర్నేటి కోటేశ్వరరెడ్డి తెలిపారు. నెల్లూరులోని వ్యవసాయ మార్కెటింగ్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదాలపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఇలా చేయడం మానుకోవాలన్నారు. ఆయన్ను రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించిన నాటి నుంచి ప్రతిపక్షాల్లో భయం మొదలైందన్నారు. దీంతో పార్టీ మారుతారని, నారా లోకేశ్‌తో భేటీ అయ్యారని పచ్చ మీడియాలో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభాకర్‌రెడ్డి కేవలం అభివృద్ధి మాత్రమే చేస్తారని, కుట్రలు, కుతంత్రాలు చేయరన్నారు. ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ రావు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదాల చేస్తున్న అభివృద్ధిని చూసి భయపడే అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన గెలుపును అడ్డుకోవడం ఎవరి తరం కాదన్నారు. సమావేశంలో నాయకులు కొండా సాయిరెడ్డి, చెన్నారెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు చెన్నారెడ్డి హరిశ్చంద్రారెడ్డి, స్వర్ణ ప్రసాద్, తాటిపర్తి వెంకటేష్, ముత్తంగి రామయ్య, వడ్డే పార్థసారథి, వరాల లక్ష్మీనారాయణ, గిరిధర్‌రెడ్డి, అక్రమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ కోటేశ్వరరెడ్డి

పథకాలపై అవగాహన

నెల్లూరు(బారకాసు): 'వికసిత భారత సంకల్ప యాత్ర'లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. నగరంలోని స్థానిక రైతుబజార్ సమీపంలో తోటబడి, జేమ్స్ గార్డెన్, ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో సంస్థ సెక్రటరీ హేమవతి పాల్గొని మాట్లాడారు. పథకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్, ఆధార్ అప్డేట్, పీఎం స్వనిధి పథకం, ముద్ర లోన్, బ్యాంకుల ద్వారా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు తదితర అంశాలపై వివరిస్తున్నామని తెలిపారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంకల్ప యాత్ర కన్వీనర్లు ఆదినారాయణ, సురేంద్రరెడ్డి, ఆంజనేయరెడ్డి, శ్రీనివాసులు, రాధాకృష్ణగౌడ్, రవిశంకర్, అశోక్, రాజేశ్వరి, విజయశ్రీ, భాస్కర్ వివిధ బ్యాంకుల ప్రతినిధులు, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



క్యాలెండర్లను ప్రదర్శిస్తున్న నాయకులు